## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

సంగెం : మండల కేంద్రంలోని సంఘమేశ్వర మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో సీఈఓగా పని చేయడానికి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చైర్మన్ పోలక లక్ష్మి, కార్యదర్శి ప్రవంతి ప్రకటనలో కోరారు. బీఎస్సీ (అగ్రికల్చర్), డిప్లొమా ఆపై చదివిన వారికి అవకాశం ఉంటుందన్నారు. 35 ఏళ్లలోపు వయస్సు, ద్విచక్ర వాహనం కలిగి ఉండాలని, కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటుగా మార్కెటింగ్, బిజినెస్ స్కిల్స్, వ్యవసాయ అనుభవం కలిగి స్థానిక మండలవాసులై ఉండాలన్నారు. పూర్తి బయోడేటాతో శాంతి మండల సమాఖ్యలో ఈనెల 22వ తేదీన సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తులు అందించాలని కోరారు.

### బీఆర్ఎస్‌లో చేరిక



నర్సంపేట : అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం చెన్నారావుపేట మండలం చెరువుకొమ్ము తండా గ్రామ పంచాయతీ కొత్తతండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్ విజయబద్దునాయక్, క్లస్టర్ బాధ్యులు, గ్రామ పార్టీ అధ్యక్షుడు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి..**

రాయపర్తి : మండలంలోని కొలన్‌పల్లి, మైలారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరినట్లు జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, వంగాల నర్సయ్య తెలిపారు.

### అందుబాటులో యూరియా

నెక్కొండ : మండలంలోని రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని ఏఓ ఎగిడి నాగరాజు అన్నారు. స్థానిక ఏఓ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని పీఏసీఎస్, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలతోపాటు ప్రైవేట్ వ్యాపారుల ద్వారా రైతులకు అందిస్తామన్నారు. రైతులకు ఎక్కడెక్కడ యూరియా అందుబాటులో ఉన్న వివరాలను వెల్లడించారు.

### నష్టపరిహారం ఇవ్వాలి



గీసుకొండ : పంట నష్టపోయిన రైతుల భూములను రీ సర్వే చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, దీంతో వారికి పరిహారం అందలేదని, రైతులందరికీ పరిహారం ఇవ్వాలని ఎంపీపీ భీమగాని సౌజన్య మంగళవారం కలెక్టర్‌కు విన్నవించారు. నష్టపోయిన అనేక మంది రైతులకు సరిగా పరిహారం రాలేదని, రీ సర్వే చేసి వారిని ఆదుకోవాలని వినతిపత్రం సమర్పించారు.

### బాధ్యతల స్వీకరణ

చెన్నారావుపేట : మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎంగా పాపమ్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే కాంప్లెక్స్ హెచ్‌ఎంగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు ఉపాధ్యాయ బృందం పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

### చట్టబద్ధత కల్పించాలి

సంగెం : పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం నిరాహార దీక్ష చేపట్టారు. మంద రాజు, నాయకులు మెట్టుపల్లి రమేష్, ఇనుముల పూర్ణయ్య, దామెర కిశోర్, మెట్టుపల్లి కుమార్, పైడి పాల్గొన్నారు.

### పథకాలను వివరించాలి

పర్వతగిరి : బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని జెడ్పీటీసీ సింగ్‌లాల్ అన్నారు. ఈ మేరకు మండలంలోని తూర్పు తండాలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల గ్రామ ఇన్‌చార్జీలు గూడ నరేందర్, దబ్బెట నరేష్ ఆధ్వర్యంలో సోమవారం ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు.

### పరామర్శ

గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్ ఉపసర్పంచ్ అప్పని కర్ణాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా కాంగ్రెస్ పార్టీ పరకాల ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, చండీగఢ్ పీసీసీ అధ్యక్షుడు హర్మోహిందర్‌సింగ్ లక్కీ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఇనగాల చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆర్థికసాయం అందించారు. మండల అధ్యక్షులు తుమ్మనపెల్లి శ్రీనివాస్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబానికి..**

పర్వతగిరి : కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్ చిన్న కుమారుడు జాటోత్ చైతన్య నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కాగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.



నెక్కొండ: శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో పూజలు



నర్సంపేట: పోచమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన గణపతి వద్ద..



దుగ్గొండి: తిమ్మంపేటలో పూజ చేస్తున్న రాజుకుమార్ తదితరులు

# కొలువుదీరిన గణనాథులు

వినాయక చవితి పర్వదినం సందర్భంగా సోమవారం వాడవాడలా గణనాథులు కొలువుదీరారు. పలు వీధుల్లో గణపతి నవ రాత్రి ఉత్సవ నిర్వాహకులు మండపాలను సర్వాంగ సుందరంగా అలంకరించి వినాయక విగ్రహాలను అర్చకులు వేద మంత్రోచ్ఛరణల నడుమ నెలకొల్పారు. భక్తులు కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొన్నారు.

\- సాక్షి నెట్‌వర్క్



నర్సంపేట పట్టణంలోని ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి వద్ద పూజ చేస్తున్న భక్తులు



నర్సంపేట: పూజ చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు



రాయపర్తి: తిర్మాలయపల్లిలో..



ఖానాపురం: పూజ చేస్తున్న యువకులు



నెక్కొండ: గుండ్రపల్లిలో..



ఖానాపురంలో..



చెన్నారావుపేట బొద్రాయి వద్ద..



నల్లబెల్లిలో మట్టి వినాయకుడికి పూజలు..



సంగెం: తిమ్మాపూర్‌లో..



రాయపర్తి: కొండూరులో..



నర్సంపేట రూరల్: పూజ చేస్తున్న భక్తులు

## ఆర్థికాభివృద్ధి సాధించాలి



మహిళా సభ్యులతో డీజీఎం సత్యం తదితరులు

సంగెం : సమాజ అవరాలు, సాంకేతికతను వినియోగించుకొని వ్యాపారాలను విస్తరించి మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలని యూనియన్ బ్యాంక్ డీజీఎం పాలుగుల సత్యం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కృష్ణవేణి గ్రామ సంఘాన్ని సందర్శించి సభ్యులతో బ్యాంకు రుణాలు తీసుకుని మహిళలు చేస్తున్న వ్యాపారాలను గురించి తెలుసుకున్నారు. మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని, వ్యాపారవేత్తలుగా ఎదగడానికి అవసరమైన ఆర్థికసాయం సంఘాల ద్వారా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ యాకర్ల అనిల్, అగ్రికల్చర్ ఇన్‌చార్జ్ జీవన్, ఏపీఎం కిషన్, సీసీలు రాజయ్య, కృష్ణమూర్తి, కుమారస్వామి, సురేష్, వీఓ అధ్యక్షురాలు రాజమణి, వీఓఏ విజయ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**బ్యాంకులో సెక్యూరిటీ పకడ్బందీగా ఉండాలి**



బ్యాంకును పరిశీలిస్తున్న ఎస్సై విజయ్‌కుమార్

రాయపర్తి : బ్యాంకులో సెక్యూరిటీని పకడ్బందీగా ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై దేశిని విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని కొండాపురం కెనరా బ్యాంక్‌ను ఎస్సై సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యాంక్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు, సెక్యూరిటీ అలరామ్ సిస్టమ్, లాకర్ సదుపాయం తదితర అంశాలపై అధికారులతో చర్చించినట్లు తెలిపారు. బ్యాంక్ మేనేజర్ వెంకటేష్, పోలీసు సిబ్బంది శ్రీనివాస్, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హామీలు విస్మరించిన బీఆర్ఎస్



పథకాలను వివరిస్తున్న విజయ్‌చందర్‌రెడ్డి

సంగెం : రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చి విస్మరించిందని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వీఆర్ఎన్ తండాలో మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా కేంద్రంలో మోదీ తొమ్మిదేళ్లలో అందించిన సుపరిపాలన, అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరిగి వివరించి ఈ సారి బీజేపీకి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బుట్టి కుమారస్వామి, మొలుగూరి శ్రీనివాస్, నాయకులు శేషాద్రి, వీరయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

## 'పథకాలను కాపీ కొడుతున్న కాంగ్రెస్'



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రాయపర్తి : కాంగ్రెస్ వాళ్లు పులిని చూసి నక్కవాతలు పెట్టుకున్నట్లుగా ఉందని బీఆర్ఎస్ పార్టీ సంక్షేమ పథకాలను చూసి కాపీ కొట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకే గ్యారెంటీ వారంటీ లేదని ఎంపీపీ, జెడ్పీటీసీ ఎద్దేవా చేశారు. మంగళవారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుక్కుగూడలో నిర్వహించిన కాంగ్రెస్ సభలో నాయకుల హామీలు తుక్కుగానే ఉన్నాయని ఆ మాటలన్నీ నీళ్ల మూటలేనన్నారు. తక్కువ వస్తువులకు అమ్ముడు పోవడానికి పదేపదే టీవీలో పేపర్‌లలో ప్రకటనలు ఇచ్చినట్లుగా వాళ్ల పథకాలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ వాళ్లు అధికారం కోసం పడరాని పాట్లు పడుతున్నారన్నారు.

**వేగంగా భవన నిర్మాణ పనులు**


రాయపర్తి మండల కేంద్రంలోని ఐకేపీ మహిళా భవన నిర్మాణ పనులు వేగంగా పూర్తవుతున్నట్లు ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ తెలిపారు. మంగళవారం భవన నిర్మాణ పనులను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పరిశీలించినట్లు తెలిపారు.

## సంక్షిప్త సమాచారం

**జాతీయ ఫార్మా కోవిజిలెన్స్ వారోత్సవాలు**

నర్సంపేట రూరల్ : లక్నేపల్లి గ్రామ శివారులోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో మూడో జాతీయ ఫార్మాకో విజిలెన్స్ వారోత్సవాలను ఎన్ఎస్ఎస్ సహకారంతో మంగళవారం నిర్వహించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఔషధాల ప్రయోజనాలు, వాటి ప్రతికూల ప్రభావాలను వివరించారు. అనంతరం కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్యాంసుందర్, డాక్టర్ నగేష్, సతీష్, నాగరాజు, వివిధ విభాగాధిపతులు విద్యార్థులు పాల్గొన్నారు.

**రాధాకృష్ణన్ అవార్డుకు గోపాల్‌రెడ్డి ఎంపిక**



చెన్నారావుపేట : శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ (ఎస్ఆర్ఎఫ్) ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ అవార్డుకు సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డిని ఎంపిక చేశారు. ఈ నెల 24న ఖమ్మంలో నిర్వహించే శ్రీనివాస్ రామానుజన్ ఫౌండేషన్ 20వ వార్షికోత్సవంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందించనున్నట్లు ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అమరేష్ ప్రకటనలో తెలిపారు.

**బేటీ బచావో.. బేటీ పడావోపై అవగాహన**

గీసుకొండ : మండలంలోని వంచనగిరి కేజీబీవీలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం సభ్యులు మిషన్ శక్తి బేటీ బచావో.. బేటీ పడావో పథకంలో భాగంగా మంగళవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. జిల్లా మిషన్ కోఆర్డినేటర్ పావని కేజీబీవీ ఉపాధ్యాయులకు పథకం గురించి వివరించారు. జెండర్ స్పెషలిస్టు రమాదేవి, హరిత, ఫైనాన్షియల్ లిట్రసీ స్పెషలిస్టు సుజాత అవగాహన కలిగించగా, స్పెషల్ ఆఫీసర్ హిమబిందు, టీచర్లు పాల్గొన్నారు.

**నిరసన**

వర్ధన్నపేట : మాజీ సీఎం చంద్రబాబు నాయుడి అరెస్టుకు నిరసనగా మంగళవారం వర్ధన్నపేటలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద జాతీయ టీడీపీ అధికార ప్రతినిధి జ్యోత్స్న, నియోజకవర్గ ఇన్‌చార్జ్ చాడా మరియా, టీడీపీ నాయకులు నిరసన తెలిపి ర్యాలీ నిర్వహించారు. కాగా పోలీసులు నిరసనకారులను అరెస్టు చేసిపోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**కల్యాణ మండపం ప్రారంభం**

గీసుకొండ : మండలంలోని మరియపురం భక్తాంజనేయ స్వామి ఆలయంలో కల్యాణ మండపాన్ని సర్పంచ్ అల్లం బాలిరెడ్డి సోమవారం వినాయకచవితి సందర్భంగా ప్రారంభించారు. బాలిరెడ్డి సొంతంగా రూ. 5 లక్షలు విరాళంగా ఇవ్వగా పనులు పూర్తయ్యాయి. ఉపసర్పంచ్ చిరంజీవి, ఆలయ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా బాలిరెడ్డిని శాలువాలు, పూలమాలలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

**మొగి పురుగుపై అప్రమత్తంగా ఉండాలి**

నల్లబెల్లి : వరి పంటలో మొగిపురుగు నివారణలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సుపీరియర్ అగ్రిసైన్సెస్ ప్రతినిధి రాజు అన్నారు. మండల కేంద్రంలోని కొత్తపల్లి రమణాచారి వరి పంటను మంగళవారం రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. మొగి పురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. శివరాత్రి శ్రీనివాస్, రాజు, రైతులు పాల్గొన్నారు.

**చర్య తీసుకోవాలి**

ఖానాపురం : బోరుబావిలో రాళ్లు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పర్శనాయక్ తండాకు చెందిన లకావత్ రవి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన వ్యవసాయ బోరుబావిలో గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు వేసి బోరు పని చేయకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశామని రైతు రవి కోరారు.

**చికిత్స పొందుతున్న యువకుడి మృతి**

రాయపర్తి : గన్నారం గ్రామానికి చెందిన జనగం విజయ్‌కుమార్(23) ఆగస్టు 30న రాఖీ పండగ సందర్భంగా తన మోటర్ సైకిల్‌పై హైదరాబాద్ నుంచి వస్తుండగా పాలకుర్తి శివారులోని కోలుకొండ వద్ద బైక్ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## బిల్లులు విడుదల చేయాలి



ఎమ్మార్సీ ఎదుట ధర్నా చేస్తున్న నిర్వాహకులు

నల్లబెల్లి : మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వాహకులు ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట మంగళవారం బైఠాయించి ధర్నా చేశారు. ఎమ్మార్సీకి తాళం వేసి ఉండడం, ఉద్యోగులు సమ్మెలో ఉన్నట్లు తెలిసింది. దీంతో వారు ధర్నాను విరమించారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యురాలు పుష్పలీల మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల పెంచిన వేతనాలు అందించాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వం తమ సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొడూరు సుమలత, ఆసం కల్పన, ఎండి సఫియా, కక్కెర్ల రాణమ్మ, వీర్ల కళ, దొనికల రజిత, శనిగరం సమ్మక్క, కొలిపాక మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి



సిబ్బందికి సంఘీభావం తెలుపుతున్న డాక్టర్లు

నర్సంపేట రూరల్ : వైద్యవిధాన పరిషత్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టర్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని డాక్టర్ వీరేన్, డాక్టర్ వంశీధర్, డాక్టర్ రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. నర్సంపేట పట్టణంలోని జిల్లా ఆస్పత్రి ఆవరణలో మంగళవారం సిబ్బంది చేపట్టిన నిరసనకు వారు సంఘీభావం తెలిపి మాట్లాడారు. వైద్య విధాన పరిషత్ ఉద్యోగులకు 010 పద్దు కింద ట్రెజరీ ద్వారా జీతాలు అందించాలన్నారు. సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని, ప్రతి జిల్లాకు ఒక డీసీహెచ్ఎస్ పోస్టు చొప్పున, నాలుగో తరగతి ఉద్యోగులకు ఇన్ సర్వీస్ ట్రైనింగ్ ఇచ్చి ల్యాబ్ టెక్నీషియన్లుగా, డార్క్ రూం అసిస్టెంట్లుగా నియమించాలని కోరారు. అర్హులైన ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని, పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలన్నారు.

## జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



నెక్కొండ : జాతీయస్థాయి నెట్‌బాల్ క్రీడా పోటీలకు విద్యోదయ గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు కరస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ నెల 9 నుంచి 11 వరకు నిర్మల్ జిల్లా శాంతినగర్‌లోని జేపీఎన్ఆర్ స్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో తమ విద్యార్థులు డి.సమీరినే, బి.అక్షయనాయక్ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి 24 వరకు హర్యానా రాష్ట్రంలో జరిగే 41వ జాతీయస్థాయి నెట్‌బాల్ చాంపియన్‌షిప్ ఫర్ ఉమెన్ (సీనియర్) విభాగంలో వారు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. చల్లా పారిజాతం, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాళ్లు షరీఫ్, నందు, పీఈటీ అఖిల్ పాల్గొన్నారు.

## 'వర్గీకరణ ప్రస్తావన తీసుకురావడం లేదు'

నర్సంపేట : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ చేస్తామని మేనిఫెస్టోలో పొందు పరిచి కనీసం వర్గీకరణ అంశాన్ని ప్రస్తావనకు తీసుకురావడం లేదని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ ఈదునూరి యాకయ్యమాదిగ అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ఈనెల 21, 22 తేదీల్లో జరిగే చలో ఢిల్లీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాకయ్య మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి మొట్టమొదటి అసెంబ్లీ సమావేశాల్లో ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేసి పార్లమెంటుకు పంపినా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు. కేంద్ర ప్రభుత్వానికి దళితులపై ప్రేమ ఉంటే కేసీఆర్ దళితులు ఆర్థికంగా ఎదగడం కోసం ప్రవేశపెట్టిన దళితబంధు పథకానికి తక్షణమే రూ.వెయ్యి కోట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాగిత ప్రసాద్, బొట్ల రమేష్, ఇల్లందుల సమ్మయ్య, తాటికాయల యాకయ్య, కొలకనూరి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై అవగాహన ఉండాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి రజిత

నల్లబెల్లి : పారిశుద్ధ్యం, వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పంచాయతీ కార్యదర్శి రజిత అన్నారు. మండలంలోని కొండాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు డంపింగ్ యార్డు నిర్వహణ, కంపోస్టు ఎరువు తయారీపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ మానవహారం చేపట్టారు. విద్యార్థులతో కలిసి అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గూబ తిరుపతమ్మ, హెచ్‌ఎం కిషన్, ఉపాధ్యాయులు జ్యోతి, నాగరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పథకాల పేరిట మోసం

- ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారపు రమేశ్

దుగ్గొండి : కేంద్ర, రాష్ట్రంలోని పాలకులు ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయకుండా ప్రజలను మభ్య పెట్టే కొత్త పథకాల పేరిట మళ్లీ మోసం చేస్తున్నార న్నారని ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆరోపించారు. ప్రజా సంక్షేమానికి బదులుగా ప్రజా సంక్షోభం ఏర్పడి భారతదేశం, తెలంగాణ రాష్ట్రం రూ.లక్షల కోట్ల అప్పులకు నిలయాలుగా మారాయని ఆయన అన్నారు. మండలంలోని గిర్నిబావిలో గల ఓ కన్వెన్షన్‌లో మండల స్థాయి కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించగా ఆయన మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో రాబోయే 3 నెలల కాలంలో పెనుమార్పులు సంభవించనున్నాయని, ప్రజాస్వామ్యం ఖూని అయ్యే పరిస్థితులు దాపురించే అవకాశాలు ఉన్నాయన్నారు. బీఎల్ఎఫ్ రాష్ట్రంలోని 119 స్థానాల్లో పోటీ చేస్తుందన్నారు. నర్సంపేటలో పునర్ వైభవం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాగెల్లి కొంరయ్య, కుసుంబ బాబురావు, మహ్మద్ రాజాసాహెబ్, సింగతి మల్లికార్జున్, బత్తిని కుమారస్వామి, బుడిమె సురేందర్, పెరబోయిన చేరాలు, ఐలోని, గాంధీ, మేరుగు సుధాకర్, గీసపాక కొంరయ్య, కోటేశ్వర్ పాల్గొన్నారు.

## 'దళితబంధు' ఎంపికలో అవకతవకలు

వర్ధన్నపేట : చెన్నారం గ్రామంలో దళిత బంధు పథకం ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బర్ల నగేష్ ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలంటే గ్రామసభ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని ఆయన అన్నారు.

**'సంక్షేమ పథకాలను అడ్డుకుంటున్నారు'**

మండలంలోని చెన్నారం గ్రామంలో దళితులు అభివృద్ధి చెందొద్దనే ఉద్దేశంతో దళితబంధు లబ్ధిదారులను ప్రభుత్వం ఎంపిక చేస్తే ధర్మసమాజ్ పార్టీ, కాంగ్రెస్, బీజేపీకి చెందిన నాయకులు అడ్డుకోవడం శోచనీయమని జన్ను భిక్షపతి, అడ్డూరి శ్రీనివాస్ తదితరులు ఆరోపించారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు ప్రకటించిన ఇళ్ల స్థలాలు పంపిణీ చేయకుండా పెండింగ్‌లో ఉన్న సమస్యను బీఆర్ఎస్ ప్రత్యేక చొరవ తీసుకుని పార్టీలకతీతంగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. దళిత బంధు లబ్ధిదారులను అడ్డుకోవడం వారి దివాళా కోరుతనానికి నిదర్శనమన్నారు. ఎంపీపీ అన్నమనేని అప్పారావు, సర్పంచ్ పానుగోటి భాస్కర్‌రావు, ఆత్మ చైర్మన్ గుజ్జ గోపాల్‌రావుకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు జన్ను బాబు, వేల్పుల ప్రవీణ్‌కుమార్, ఓదయ్య, కుమారస్వామి, అడ్డూరి వెంకటయ్య, జన్ను రవి, తూల్ల రవి, అడ్డూరి రాములు, సాలమ్మ పాల్గొన్నారు.